క్లుప్తంగా

భీమేశ్వరాలయంలో కుంభాభిషేకం


ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

సంగం: మండలంలోని వంగల్లు గ్రామంలో వెలసిన భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ చైర్మన్ పగడాల రఘురామయ్య ఆధ్వర్యంలో కుంభాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం

అనుమసముద్రంపేట: మండలంలోని ప్రధాన కూడళ్లలో విజువల్ పోలీసింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సంగం సీఐ రవినాయక్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రధాన సెంటర్లలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో మహిళలకు, దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఆయన వెంట ఎస్సై నరేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గిరిజనులకు అన్నదానం

ఆత్మకూరు: స్థానిక మున్సిపల్ పరిధిలోని జమ్మలపాళెం గిరిజనకాలనీలో బీఎస్సార్ ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ ఎ.షకీల తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం గిరిజనులకు అన్నదానం చేశారు. గిరిజన మహిళల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి పంచిపెట్టారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సాధిక్ హుస్సేన్, ప్రజానాట్యమండలి ప్రతినిధి గద్దర్ బాబు, వాగాల శ్రీహరి, ఖాజారసూల్, గుల్జార్ బేగం తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని బైపాస్ రోడ్డులో నడుస్తున్న వృద్ధుడిని వెనుకనే వస్తున్న బైక్ ఢీకొని తీవ్రగాయాలపాలైన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శివశంకర్‌రావు వివరాల మేరకు వెంకట్రావుపల్లి గిరిజనకాలనీకి చెందిన మల్లిక అంకయ్య(75) ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి బైపాస్ రోడ్డులో ఇంటికి వస్తున్న క్రమంలో వెనుకనే వస్తున్న బైక్ ఢీకొని గాయాలపాలయ్యాడు. ఈ మేరకు సోమవారం అంకయ్య భార్య భూదేవమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంకయ్యను చికిత్సనిమిత్తం తొలుత ఆత్మకూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. బైక్ వివరాలు తెలియాల్సిఉంది.

చిన్నారి వైద్యానికి సాయం

ఆత్మకూరు: మెట్ల మీద నుంచి జారిపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి వైద్యం కోసం ఆత్మకూరుకు చెందిన డాక్టర్ జె.ప్రణీత్ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఏఎస్‌పేట దర్గా వద్దకు వచ్చిన జైరున్నీసా అనే చిన్నారి ఇటీవల ఏఎస్‌పేటలోని ఓ ఇంటి వద్ద మెట్ల మీద నుంచి జారిపడి గాయపడిన నేపథ్యంలో డాక్టర్ ప్రణీత్ సోమవారం ఆర్థికసాయం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చే సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆర్డీఓ సాధు కరుణకుమారి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్పందనలో 8 అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోండి

సీతారామపురం: సీతారామపురం పంచాయతీలో మేత పోరంబోకు భూములు కబ్జా కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు సోమవారం తహసీల్దార్ షాజియాకు ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పంచాయతీ సర్వే నంబర్.1లో 438 ఎకరాల మేత పోరంబోకు భూములు ఉన్నాయని, ఈ భూమికి ఎలాంటి పట్టాలు ఇవ్వరాదని, భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

కావలిరూరల్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కావలి రూరల్ సీఐ ఎం.రాజేష్ అన్నారు. కావలి రూరల్ మండలంలోని తాళ్లపాళెం రూరల్ హెల్త్ సెంటర్‌లో ఆదరణ కేంద్రం నిర్వాహకురాలు సిస్టర్ జసింతమేరి ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాధితులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించి ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్యాంసుందర్, సిస్టర్ జనోవా, ఆదరణ కేంద్రం వలంటీర్లు డి.సుబ్బారావు, శ్రీనివాసరావు, కృష్ణకుమారి, అమృత రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి


కావలి: తన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: జాతిపిత మహాత్మాగాంధీ అనుసరించిన సత్యం, శాంతి, అహింసలే సమాజ హితానికి ఆయుధాలని, మహాత్ముడు చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే సోమవారం కావలిలోని తన కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి, స్థానిక ట్రంక్‌రోడ్డులోని మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ అందరూ అన్నదమ్ముల వలె మెలగాలని సూచించారని, అప్పుడే సమాజంలో ప్రశాంత వాతావరణం ఉంటుందని తెలిపారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. మహాత్ముడు ప్రజలకిచ్చిన సందేశాన్ని మానవజాతి శాశ్వతంగా గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, ఎంపీపీ కొండమ్మ, నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, మామిడి రామకృష్ణ, తిరువీధి ప్రసాద్, అమరా వేదగిరి, కుందుర్తి కామయ్య, గంధం ప్రసన్నాంజనేయులు, కొమారి రాజు, పుత్తూరి నాగాచారి, మండలి కృష్ణారావు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, దస్తగిరి, ఖమర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆధ్వర్యంలో..

అల్లూరు: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వీరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో..

ఆత్మకూరు: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయం(ఎంజీఆర్ హాలు)లో ఎమ్మెల్యే సూచనల మేరకు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, కొండా వెంకటేశ్వర్లు, ఇందూరు వెంకటరమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు మహబూబ్ బాషా, గంధళ్ల వేణు, శివకోటారెడ్డి, సయ్యద్ జమీర్, చిన్నపరెడ్డి, జైపాల్‌రెడ్డి, కలాం తదితరులు పాల్గొన్నారు.

స్వరాజ్య సాధనకు బాటలు వేసిన మహనీయుడు

ఆత్మకూరురూరల్: సత్యం, శాంతి, అహింస ఆయుధాలుగా స్వరాజ్య సాధనకు బాటలు వేసిన మహనీయుడు మహాత్మాగాంధీ అని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు కొనియాడారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ శాఖల అధికారులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, ఏపీఓ శిరీషారెడ్డి, సాంకేతిక సహాయకుడు రామకృష్ణ, ఉపాధి హామీ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

అనుమసముద్రంపేట: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం హమీద్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి మహాత్ముని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చేజర్ల: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివకృష్ణయ్య ఆధ్వర్యంలో మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ పి.విజయ్, వీఆర్వోలు కె.లక్ష్మీనారాయణ, సీహెచ్ కోటేశ్వరరావు, సిబ్బంది గుత్తా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే ఆదూరుపల్లి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ శైలజాకుమారి ఆధ్వర్యంలో మహాత్మునికి నివాళులర్పించారు.

ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో..

సంగం: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గోపి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ అప్పాజీ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్ముని విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గిరిబాబు, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, విద్యార్థుల నివాళి..

మర్రిపాడు: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్, డీటీ ఆనంద్‌రావు, ఆర్ఐ సురేంద్ర, సిబ్బంది మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపల్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గాంధీజీకి నివాళులర్పించారు. విద్యాలయ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహాత్మునికి నివాళి

ఉదయగిరి: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్ముడు స్వాతంత్య్రం కోసం చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ సహాయకులు గోపి, సమద్, మండల కోఆర్డినేటర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారిణి శివకల్పన ఆధ్వర్యంలో గాంధీజీకి నివాళులర్పించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాయిపేట సచివాలయంలో..

కొండాపురం: గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని సాయిపేట సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.చెన్నకేశవులు ఆధ్వర్యంలో మహాత్ముని చిత్రపటానికి ఎంపీడీఓ బ్రహ్మయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. వైద్యసిబ్బంది, వీఆర్వో ఏవీవీ ప్రసాద్, పీహెచ్ఎన్ఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు: ఎమ్మెల్యే కార్యాలయంలో..


సంగం: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


అల్లూరు: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి తదితరులు


ఆత్మకూరురూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో..


చేజర్ల: తహసీల్దార్ కార్యాలయంలో..


ఉదయగిరి: ఎంపీడీఓ కార్యాలయంలో..


మర్రిపాడు: కేజీబీవీలో..

పేదల సంక్షేమమే ధ్యేయం

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నగారిపాళెం పంచాయతీ ఓట్టూరు గ్రామంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. పింఛన్ల పంపిణీ, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల మంజూరుపై ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు ప్రారంభమవడంతో కావలి మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. అలాగే జువ్వలదిన్నెలో ఏర్పాటవుతున్న ఫిషింగ్ హార్బర్ ద్వారా ఉపాధి దొరుకుతుందన్నారు. ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టు నిర్మాణాలతోపాటు పరిశ్రమలు కూడా ఏర్పాటైతే కావలి మండలంలో అనూహ్యమైన అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే జగనన్నతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్‌ను ఢీకొన్న బైక్

- ఇద్దరికి తీవ్రగాయాలు

సీతారామపురం: మండలంలోని సంజీవరెడ్డినగర్ సమీపంలో సోమవారం ఓ బైక్ బస్‌షెల్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. సింగారెడ్డిపల్లికి చెందిన కె.శ్రీనివాసులు, కె.సుబ్బయ్య బైక్‌పై ఉదయగిరి నుంచి సీతారామపురానికి వస్తుండగా సంజీవరెడ్డినగర్ సమీపంలో బైక్ అదుపు తప్పి బస్‌షెల్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సుబ్బయ్యకు కాలు విరగ్గా, శ్రీనివాసులు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్సనిమిత్తం వారిని ఉదయగిరిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే బాధ్యతగా నిర్వహించాలి

ఉదయగిరి: మండలంలోని గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సిటిజన్ ఔట్ రీచ్ సర్వేను బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. సోమవారం పట్టణంలో వలంటీర్లు చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలిచ్చారు. వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి వారికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. అనంతరం వారి ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఆయన వెంట సీఏ గాజుల ఇమ్రాన్ ఉన్నారు.


సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

అవార్డు గ్రహీతలకు సన్మానం


పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు


ఆత్మకూరు: ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీదేవిని సన్మానిస్తున్న హాస్టల్స్ సిబ్బంది

ఉదయగిరి: తమ విధుల్లో ఉత్తమ సేవలు అందించి గణతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరులో కలెక్టర్ చక్రధర్‌బాబు చేతులమీదుగా అవార్డులు అందుకున్న పలువురు ఉద్యోగులను సహచర సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మండలంలోని గండిపాళెం పంచాయతీ కార్యదర్శి గాజులపల్లి అమర్‌నాథ్‌రెడ్డిని గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. అలాగే గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న నూర్జహాన్‌ను వైద్యాధికారిణి శివకల్పన, సిబ్బంది ఘనంగా సన్మానించారు. జిల్లా ఎంఈఓల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఎంఈఓ మస్తాన్‌వలిని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎంఆర్సీ భవనంలో సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడుసుమల్లి వెంకటేశ్వర్లు, వీఏఏ ఫయాజ్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రియాజ్, ట్రస్ట్ సభ్యులు బి.వెంకటేశ్వర్లు, జానీ, గ్రామస్తులు సీహెచ్ చిన్న వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీదేవికి సన్మానం

ఆత్మకూరు: బీసీ సంక్షేమ వసతి గృహాల అధికారిణి(ఏఎస్‌డబ్ల్యూఓ) చల్లా శ్రీదేవి ఇటీవల కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆమెను సంక్షేమ వసతి గృహాల సిబ్బంది సోమవారం పట్టణంలోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అన్ని బీసీ వసతి గృహాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సేవలకు పురస్కారం



జలదంకి: జలదంకికి చెందిన ఐకేర్ మిషన్ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డికి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన అవార్డును అందుకున్నట్లు తెలిపారు. అంధులు, పేద విద్యార్థుల చదువులకు చేయూతనిస్తూ వారి ఆరోగ్యం కోసం ఆర్థికసాయం చేయడం, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తమ సేవలను గుర్తించి ఈ అవార్డును అందించినట్లు శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పలువురు శ్రీనాథ్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

భూముల సర్వేపై వినతి

సోమశిల: నూతనంగా మంజూరైన జాతీయ రహదారి – 67 నిర్మాణం కోసం భూముల సర్వే పక్కాగా నిర్వహించాలని కోరుతూ రైతులు తహసీల్దార్ అన్నదాత వెంకటరమణరావుకు వినతిపత్రం అందజేశారు. భూమి కోల్పోతున్న రైతులతో అనంతసాగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అవార్డు ఎంక్వయిరీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు పుల్లారెడ్డి, చెన్నయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియ పరిశీలన

అల్లూరు: మండలంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను డీటీ సైమన్‌బాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూవివాదాల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం రీసర్వే చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అనుదీప్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎంఈఓ విచారణ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఓ విద్యార్థినిని ఆంగ్ల ఉపాధ్యాయుడు చంద్ర శ్రీనివాసులు చితకబాదిన ఘటనపై సోమవారం ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి ఆ పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన బాధిత విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను విచారించి లిఖితపూర్వకంగా వివరాలు సేకరించారు. అలాగే తరగతిలోని విద్యార్థులను, ప్రధానోపాధ్యాయుడిని విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విద్యార్థినిని కొట్టిన ఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టానని, నివేదికను జిల్లా అధికారులకు నివేదిస్తామని తెలిపారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వింజమూరు: మండలంలోని మోటుచింతలపాళెం సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ ఎస్సై బి.అశోక్‌కుమార్ సోమవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌లోని 4.5 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

ఆత్మకూరు: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై తనకు అవగాహన ఉందని, తాను ఎమ్మెల్సీగా ఎన్నికైతే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగనున్న తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. అంతకుముందు సంగంలోని శ్రీనేతాజీ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులతో మాట్లాడి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఆత్మకూరులో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

క్రీడల్లో సత్తాచాటిన కేజీబీవీ విద్యార్థినులు

కావలిరూరల్: గ్రిగ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో కావలిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు సత్తాచాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్.సంధ్యారాణి మాట్లాడుతూ గత రెండు రోజులుగా భీమవరంలో జరుగుతున్న గ్రిగ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో రోప్ స్కిప్పింగ్‌లో అండర్ – 14, 17, 19 విభాగాల్లో డి.దీపిక బంగారు పతకం, పి.స్వాతి వెండి పతకం, జి.శ్రావణి, ఆర్.సుమలత కాంస్య పతకాలు సాధించారు. అలాగే పలువురు విద్యార్థినులు ఈ పోటీల్లో ప్రతిభ చాటారు. క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థినులను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, సహచర విద్యార్థినులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ అనిత తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పేకాట స్థావరంపై దాడులు

మర్రిపాడు: మండలంలోని కంపసముద్రం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సిబ్బంది దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.09 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట, కోడిపందెం లాంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిర్మాణ వ్యయం పెంచాలి

ఆత్మకూరురూరల్: పేదలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న జగనన్న కాలనీలకు ప్రస్తుతం అందజేస్తున్న రూ.1.80 లక్షల ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని సీపీఐ ఆత్మకూరు నియోజకవర్గ సమితి నాయకులు సోమవారం ఆత్మకూరులో తహసీల్దార్ లక్ష్మీనరసింహంకు వినతిపత్రం అందజేశారు. పూర్తి సబ్సిడీ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి యామాల మధు, నాయకులు శేషాద్రి, కృష్ణ, పుల్లయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

మర్రిపాడు: మండలంలోని పొంగూరు కండ్రిక గ్రామంలో గాలిబోయిన పెంచలయ్యకు చెందిన పొగాకు బ్యారన్ సోమవారం అగ్నికి ఆహుతైంది. రైతు పెంచలయ్య గ్రామంలో తనకున్న పొలంలో పొగాకు పంట సాగు చేసి బ్యారన్‌లో క్యూరింగ్ చేసుకునేవాడు. అయితే సోమవారం ఉదయం బ్యారన్ ఆరుదల సమయంలో కర్రలు జారి సీటిగొట్టంపై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇరుగుపొరుగు వారు వచ్చేలోపే బ్యారన్‌లోని పొగాకు, అల్లుడుకర్రతోపాటు సర్వం కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని బాధిత రైతు పెంచలయ్య వాపోయాడు.


పొగాకు బ్యారన్‌లోంచి బయటికి వస్తున్న పొగలు